



ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

సంపుటి : 9 | సంచిక : 8 | పుష్పం : 14-17 | 5-1-2004


**RAMANA BHASKARA**

TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE

PAGES : 16

VOL : 9 ISSUE : 8

EDITOR
P.S. RAMA RAJU

EDITING
P.H.V. SATYAVATHI
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 224589, 224689

PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 222438, 221260
94401-31188


## మానవాళికి అపూర్వవరం భగవాన్ శ్రీరమణమహర్షి

సృష్టికి ఆధారంగా ఉన్న మహాచైతన్యము, పరమ కరుణ, పరమ శాంతి, జీవకోటిపై కరుణతో స్వరూపచైతన్యంలో మేల్కొలపడానికి ఒక దేహము ధరించి, జగద్గురువు భగవాన్ శ్రీరమణమహర్షి రూపంలో సుమారు నూట ఇరువది నాలుగు సంవత్సరముల క్రితము, అనగా ది. 30-12-1879న భూమిపై అవతరించి సుమారు పన్నెండు సంవత్సరములు తిరుచ్చుళి గ్రామములోను, నాలుగు సంవత్సరములు మధురై లోను, పిమ్మట జీవన్ముక్తస్థితిలో ఏబదినాలుగు సంవత్సరములు అరుణాచలంలోను సంచరించింది.

భగవాన్ శ్రీరమణమహర్షి వారి జీవితకాలంలో అత్యంత సహజంగా జీవించి, వారి ఆధ్యాత్మిక సౌశీల్యం ద్వారా జగత్తుకే ఆదర్శప్రాయులుగా నిలిచి, యావత్ ప్రపంచాన్ని ఆకర్షించి, జీవకోటిని సహజస్థితిలో మేల్కొలుపుటకై తన సర్వస్వాన్ని అర్పించిన మహాత్యాగి, జగద్గురువు, ఆధునిక మహర్షి వారు. కేవలము వారి ఉనికి, సమక్షము సందర్శకుల మనస్సులను, దేహేంద్రియమనోబుద్ధుల పరిధిని దాటిన సహజస్థితికి మేల్కొలిపెడిది. వారి జీవితము అద్భుతాలలోకెల్ల అద్భుతమై, "పరమశాంతి" అనెడి పరిమళాన్ని వెదజల్లెడిది. అందరిలోను, అన్నింటిలోనూ తనను తానే దర్శించిన మహాజ్ఞాని.

వారి దృష్టిలో కేవలం ఉన్నదే 'ఆత్మ', ఆత్మ కన్న భిన్నముగ

**ఈ సంచికలో......**

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**


23-11-2003 పాలకొల్లు .......... 2
04-12-2003 అరుణాచలం .......... 9
05-12-2003 అరుణాచలం .......... 11
06-12-2003 అరుణాచలం .......... 13




కించిత్తూ లేదు, అదే 'నిజమైన - నేను', అదే స్వరూపము, అదే సచ్చిదానంద కేవల అద్వితీయస్థితి.

ఆత్మసాక్షాత్కారం క్రొత్తగా పొందేది కాదు, ఆవహించిన అజ్ఞానాన్ని వదులుకోవడమే! కాని దానికి భిన్నముగా 'దేహమే - నేను' అను భ్రాంతి వలన దుఃఖాన్ని మోస్తూ, జన్మపరంపరలకు లోనవుతున్నాము. అజ్ఞాన జనిత దుఃఖాన్ని, అశాంతిని తొలగించుకోవడానికి ఆత్మ సమర్పణ, ఆత్మవిచారణ అను రెండు పద్ధతులను భగవాన్ సూచించారు. అందుకు మనము నిరంతరం ఆత్మగా అనగా అహంకార రహితంగా వర్తమానంలో జీవించాలి, దానికి భగవాన్ శ్రీరమణుల జీవితమే ఒక ఉదాహరణ. అట్టి మహనీయుని ఋణము తీర్చుకొనవలెనన్న సకలమును 'గురు' రూపంగా దర్శించి సత్యానుభూతిని పొందాలి.

(భగవాన్ శ్రీరమణమహర్షి జయంతి సందర్భంగా)

చావలి సూర్యనారాయణ మూర్తి, టీచర్, అమలాపురం

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 23-11-03, పాలకొల్లు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం అజ్ఞానంలోనుండి విడుదలపొందటానికి భక్తిమార్గం, జ్ఞానమార్గం, కర్మమార్గం, ధ్యానమార్గం ఇలా అనేక మార్గాలను మనకు భగవంతుడు చెప్పాడు. మనకు నచ్చిన మార్గంలో ప్రయాణించి అజ్ఞానంలోనుండి విడుదల పొందాలి, అది ముఖ్యం. నువ్వు కుమారస్వామి అవతారమని, నువ్వు బ్రహ్మజ్ఞానివని, జ్ఞానాన్ని ఉపదేశించటానికి ఆలోకం నుండి ఈలోకానికి వచ్చావు అని ఇలా అనేకపద్యాలు వ్రాసి ఓంసాధుగారు భగవాన్‌కు ఇచ్చారు. దానికి భగవాన్ ఏమిచెప్పారు అంటే ఇవన్నీ అనవసరం, నేను గొప్పవాడిని అయితే నీకు ఏమి కలిసివస్తుంది, నువ్వు బాగుపడే విధానం చూసుకో అని చెప్పారు. స్టేట్‌బ్యాంక్‌లో కోట్లరూపాయలు ఉన్నాయి కాని నీజేబులో రూపాయి లేదు దానివలన ప్రయోజనం ఏమిటి. ఎవరో జ్ఞాని అని చెప్పటం కంటే నువ్వు జ్ఞానాన్ని సంపాదించు, నీకు సుఖం తెలుస్తుంది. నువ్వు నేర్చుకోవలసింది ఏదో నేర్చుకో, తెలుసుకోవలసింది ఏదో తెలుసుకో. కేవలం చెట్లుచుట్టూ, రాళ్ళచుట్టూ తిరిగితే అది తెలియదు. అది లేని చోట నీవు వెతుకుచున్నావు,

సత్యవస్తువు నీహృదయంలోనే ఉంది, అక్కడ వెతికితే అదినీకు దొరుకుతుంది. అసత్యములోపల సత్యం ఉంది. నువ్వు రవ్వంతలోచూపు నేర్చుకో. మనందరము బయటచూపుకు అలవాటు పడిపోయాము. ఈశరీరం చనిపోతే మరల చూడటానికి ఈశరీరం కనబడదని, మరణం వచ్చినప్పుడు మనకు దుఃఖం కలుగుతుంది. దుఃఖ రహితస్థితి నీహృదయంలోనే ఉంది. అయితే నీవు లోచూపు నేర్చుకోవాలి, సత్వగుణాన్ని అలవరచుకోవాలి. లాభం వచ్చినప్పడు మనం పొంగిపోతాము, నష్టం వచ్చినప్పడు మనం కృంగిపోతాము. లాభం, నష్టం అసత్యంఅని నీకు తెలిస్తే ఈహెచ్చుతగ్గులు ఉండవు. చావుపుట్టుకలకు అతీతంగా ఒకసత్యవస్తువు నీహృదయంలో ఉంది. రాంగ్‌తింకింగ్ వలన, రాంగ్‌హ్యాబిట్స్ వలన అది నీకు తెలియడంలేదు. నీవు సాధనచేసి రాంగ్‌తింకింగ్‌లోనుండి, రాంగ్‌హ్యాబిట్స్ లోనుండి, కర్తృత్వంలోనుండి విడుదలపొందు అప్పుడు వస్తువు నీకు తెలుస్తుంది. సూరమ్మగారు అరుణాచలం వెళ్ళినప్పడు భగవాన్‌ను అడిగారు స్వామీ నాకు ఏమీ అక్కరలేదు, మోక్షం కావాలి అని కోరుకుంటున్నాను అన్నారు. భగవాన్ అప్పటికప్పడే సమాధానం చెప్పేసారు. గీతలో ఇలా ఉంది, ఉపనిషత్‌లలో ఇలా ఉంది అని ఈమాటలు ఏమీ చెప్పలేదు. నీకు మోక్షం కావాలంటున్నావు, నేనును అంగీకరిస్తున్నావు. ఏదైతే నీకు నేనుగా స్ఫురిస్తోందో ఆ నేనును బయటకు తోలెయ్యి, దానిని బయటకు తోలేస్తే ఉన్నది మోక్షమే, ఉన్నది శాంతే, ఉన్నది సుఖమే అన్నారు భగవాన్. జ్ఞానము అంటే పుస్తక జన్య జ్ఞానము జ్ఞానము కాదు. దేని స్వరూపమైతే సుఖమో, దేనిస్వరూపమైతే శాంతో, ఏదైతే అన్ని కాలాలలో, అన్నీ అవస్థలలో సదా ఉంటుందో అదే జ్ఞానము, అది నీకు అనుభవైకవేద్యము కావాలి. అది నీమాటలకు, ఇంద్రియాలకు, మనస్సుకు అందదు. ఎక్కడయితే నీమనస్సు నశించిందో అక్కడే అది నీకు అనుభవంలోనికి వస్తుంది. సూర్యుడు ఎప్పడైనా చీకటిని







చూడాలన్నా చూడలేడు అలాగే ఆత్మజ్ఞానం పొందినవాడు దుఃఖాన్ని చూడాలన్నా చూడలేడు. ఎందుచేతనంటే దాని స్వరూపమే సుఖం, వాడు సుఖం కోసం ఈ ప్రపంచంలో దేనిమీద ఆధారపడనక్కరలేదు, అది స్వతంత్ర్యమైన సుఖము, అది నిజమైన సుఖము. రామకృష్ణపరమహంసకు ఏదో చిన్న ఉద్యోగం, బాహ్యంగా చూస్తే ఆయనకు ఏమీలేదు కాని చేయవలసిన ప్రయాణం అంతా లోపలే చేశారు. వైరాగ్యం వలన వస్తువు ఎంతలోతులలో ఉందో అంతలోతులలోనికి వెళ్ళారు, పొందవలసినది పొందారు, అందుచేత ఆయనకు సంతకం చేయడం చేతకాకపోయినా వరల్డ్ టీచర్ అయి కూర్చున్నారు. డాక్టరు ఏవిధంగా మెడిసిన్ ప్రాక్టీస్ చేస్తాడో అలాగే భక్తుడు కూడా సత్వగుణాన్ని ప్రాక్టీస్ చెయ్యాలి, అలా ప్రాక్టీస్ చేస్తే తూకం పెరుగుతుంది, తూకం ఉంటే లోపలకు వెళ్ళగలము. భగవంతుడు గీతలో ఏమిచెప్పాడు అంటే ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు, ఉన్నదానికి లేకపోవటం అంటూలేదు, లేనిదానికి ఉండటం అంటూ లేదు, ఇది నిశ్చయం. ఇది నీకు అర్థం కాకపోవచ్చు కాని అర్థం చేసుకోవటానికి నువ్వు ప్రయత్నం చెయ్యి అని చెప్పాడు. జ్ఞానికి సంచితం నశిస్తుంది, ఆగామి నశిస్తుంది, ప్రారబ్దమును జ్ఞాని కూడా అనుభవించాలి అని శాస్త్రం చెపుతోంది అని అంటే దీనికి భగవాన్ ఏమి చెప్పారు అంటే ధశరధుడికి ముగ్గురు భార్యలు, ధశరధుడు చనిపోయినప్పడు ముగ్గురు భార్యలకు వైధవ్యం వస్తుందా లేక ఇద్దరు భార్యలకు వైధవ్యం వస్తుందా అని అడిగారు అంటే ముగ్గురికి వైధవ్యం వస్తుంది అని చెప్పారు. అలాగే మిధ్యానేను నశించినప్పడు అంటే మనకు జ్ఞానం కలిగినప్పడు ఆగామి సంచితాలతో పాటు ప్రారబ్దం కూడా నశిస్తుంది అని చెప్పారు. అయితే జ్ఞాని కూడా ప్రారబ్దమును అనుభవిస్తున్నాడు కదా అని అడుగుతున్నారు. నేను ప్రారబ్దమును అనుభవిస్తున్నాను అని జ్ఞాని అనుకోడు, అలా అనుకుంటే వాడు జ్ఞాని కాడు, జ్ఞాని కూడా ప్రారబ్దమును అనుభవిస్తున్నాడు అని చూచేవారికి అనిపిస్తుంది అని చెప్పారు. మనకు ఏ అలవాటు అయితే మనస్సును బాహ్యముఖం చేస్తోందో నీవు పరిశీలించి దానిని కట్ చేయాలి. నువ్వు ఏదైతే నేను, నేను అంటున్నావో ఆమొదటితలంపుకు ఫుడ్‌సప్లయిని కట్‌చేస్తే దానికి నేచురల్‌గానే డెత్ వస్తుంది. శరీరం మరణం మరణమే కాదు. దేహంతో తాధాష్యం పొందే ఆమొదటి తలంపు నశించాలి అప్పడు నిజంగానే నీవు చనిపోయినట్లు. ఆనేనులో నుండి విడుదల పొందటానికే యోగం. యోగం అంటే ఐక్యం అవ్వటం. దేహగతమైననేను ఉన్నంతకాలం నీవు సత్యంలో, నిజమైన నేనులో ఐక్యం కాలేవు, దేహగతమైననేను నశించినప్పడే నువ్వు ఆత్మాకారం చెందుతావు. మనం నూటికి నూరుపాళ్ళు ఆరోగ్యముగా ఉన్నాము అనుకోండి హాస్పటల్ గాని, డాక్టర్ గాని గుర్తుకు రాదు అలాగే మనం నూటికి

నూరుపాళ్ళు సుఖంలో, శాంతిలో ఉన్నాము అనుకోండి అప్పడు మనకు దేవుడు ఉన్నాడా, లేడా అనే సమస్యే రాదు. మనందరకు సుఖం కావాలి, శాంతి కావాలి అది దేవుడిలో ఉందని దేవుడి కోసం మనము వెతుకుచున్నాము. నీ పేరు శ్యామల అనుకో, నువ్వు రాత్రి నిద్రపోయినప్పడు సుఖంగా ఉంటున్నావు, పగలు ఏడుస్తున్నావు. నీకు నిద్రలో స్త్రీ పురుష గొడవలేదు, మతం గొడవలేదు, దేవుని గొడవలేదు కాని నీవు ఉన్నావా, లేదా అంటే నీవు ఉన్నావు. రాత్రి శ్యామల ఏడవటం లేదు, పగలు శ్యామలఏడుస్తోంది. మరి రాత్రి శ్యామల, పగలు శ్యామల వేరా అంటే ఒకటే శ్యామల. కాని రాత్రి సుఖంగా ఉంటోంది, పగలు ఏడుస్తోంది దీనికి కారణం ఏమిటి ? రీజన్ మనకు ఎంతవరకు సహకరిస్తోందో అంతవరకు దాని సహకారం మనం తీసుకోవాలి. గాఢనిద్రలోనుండి జాగ్రదవస్థలోనికి రాగానే సూర్యకిరణం భూమి మీదకు ఎంత వేగంగా వస్తుందో అంతవేగంగా నేను అనే తలంపు హృదయంలోనుండి సహస్రారంలోనికి వచ్చి దేహంతో తాదాప్యం పొందుతుంది. మనకళ్ళు ఆస్పీడును గుర్తించలేవు. ఇలా నీవుకాని దేహంతో, మనస్సుతో ఎప్పడైతే తాదాప్యం పొందటం ప్రారంభించావో అప్పడు నీకు దుఃఖం ప్రారంభం అవుతుంది. మీరు ప్రాణాయామాలు చేయండి, ఉపవాసాలు చేయండి, యోగాభ్యాసాలు చేయండి, మీ గురువులు ఎవరైనా, మీరు ఏమతంలో ఉన్నా ఇబ్బంది లేదు కాని ఒకటి మాత్రం మీరు గుర్తు పెట్టుకోండి. ఈ శరీరం నాది, ఈపేరు నాది అని పర్టిక్యులర్ శరీరంతోటి, పేరుతోటి మీకుతాదాప్యం ఉన్నంతకాలం దుఃఖం మిమ్ములనువిడిచిపెట్టదు, దుఃఖరహితస్థితిని మీరు పొందలేరు. మనం మంచివారము అని మనం అనుకుంటే సరిపోదు, భగవంతుడు అనుకోవాలి. నిజంగా మనలో మంచితనం ఉంటే మనకు ఆత్మజ్ఞానం వచ్చేస్తుంది.బుద్ధగయలో ఒక చెట్టుక్రింద బుద్ధుడికి నిర్వాణస్థితి కలిగింది. అప్పడు ఆనందం, సుఖం, శాంతి వచ్చి ఆయనను ముంచేస్తున్నాయి, అలా కొద్దిరోజులు అక్కడ ఉండిపోయాడు. ఆయన దయాస్వరూపుడు. ఆయనలో ఉన్న దయే, శాంతే టీచింగ్ క్రింద మారింది. ఆయన మాటవేరు, దయ వేరు కాదు. ఆమాట దయతో, శాంతితో, ఆనందంతో నిండి ఉంటుంది. భగవాన్ శరీరం మరణించే చివరిరోజులలో భగవాన్ను ఒకప్రశ్న అడిగారు. ఇప్పడు మీశరీరం పడిపోతుంది కదా మరి మమ్మల్ని ఎవరు ప్రేమిస్తారు అని అడిగారు. దానికి భగవాన్ ఏమిచెప్పారు అంటే ఈశరీరం ఉన్నప్పడు కూడా ఈశరీరం మిమ్మల్ని ప్రేమించటం లేదు ఏదైతే మిమ్మల్ని ప్రేమిస్తోందో దానికి మరణం లేదు. ఈమరణానికి, ప్రేమకు సంబందం లేదు, మరణించేది మిమ్మల్ని ప్రేమించటం లేదు అని చెప్పారు. ఆత్మయొక్క స్వభావమే సుఖం నిప్పుకు వేడి ఎంత సహజమో నీలోపలఉన్న వస్తువుకు సుఖం, శాంతి అంత సహజం.





అది నార్మల్గా ఉంటుంది, నాచురల్గా ఉంటుంది. నీవు ఎప్పడైతే ఆవస్తువును పొందావో అప్పడు సుఖీ అవుతావు, ఆ సుఖానికి ముగింపు ఉండదు. ఆ సుఖం పరిణామంలో దుఃఖం క్రింద మారదు ఎందుచేతనంటే అది స్వతంత్ర్యమైనది. నువ్వు ఇంద్రియాల ద్వారా మనస్సు ద్వారా, ప్రపంచంలోని సంఘటనల ద్వారా ప్లెజర్ తీసుకుంటే ఆప్లెజర్ అంతా పరిణామంలో దుఃఖం క్రింద మారిపోతుంది, ఇందులో సందేహంలేదు. నీహృదయంలో ఉన్న వస్తువు ఎప్పడైతే నీకు అనుభవంలోనికి వచ్చిందో అప్పడు నీకు భేధం రాలిపోతుంది,అప్పడు ఎటు చూసినా ఆనందమే, ఎటు చూసినా శాంతే. అప్పడు దేహం ఉండటం వలన వాడికి లాభం లేదు, దేహం పోవటం వలన వాడికి నష్టం లేదు. ఆస్థితి ఎక్కడ ఉంది అంటే అది నీహృదయంలోనే ఉంది. శరీరం చనిపోయేటప్పడు నేను చనిపోతున్నాను అని ఎవడైతే అనుకుంటున్నాడో వాడు 100% అజ్ఞానే, అంటే వాడికి చావులేని పదార్థంతో తాదాప్యం లేదు, వాడికి ఎంత డబ్బు ఉన్నా ఎంత గౌరవం ఉన్నావాడు ఫెయిల్అయిపోయినట్లే. వాడు జీవితంలో మిగతావి ఎన్ని సాధించినా అవి ఒకటి లేని సున్నలు.

గుడిలో ఉన్న దేవుడు సాపేక్షిక సత్యం, హృదయంలో ఉన్నదేవుడు నిజమైనదేవుడు. కాని మనకు గుడిలోఉన్న దేవుడి మీద ఉన్న ఇష్టం హృదయంలో ఉన్న దేవుడి మీద మనకు లేదు. ఇదే మాయ, ఇదే అజ్ఞానం. గుడికి వెళ్ళటం మనకు తేలిక కాని హృదయంలోనికి వెళ్ళటం కష్టం. ఇప్పడు మరణం నిన్ను ఓడిస్తోంది కాని నీవు మరణాన్ని ఓడించాలి లేకపోతే నీకు వెంటనే పునర్జన్మ వచ్చేస్తుంది. మన పరిస్థితి ఎలా ఉంది అంటే పునాది లేకుండా మేడలు కడుతున్నాము, పునాది లేకపోతే అవి పిచ్చుక గూడులా ఉంటాయి. నాకు మీమీద ప్రేమ లేదు, ఎటుచూసినా ద్వేషమే మరి నేను ఆత్మజ్ఞానం ఆశించటం ఏమిటి ? నేను L.K.G చదవలేదు, I.A.S ఎంట్రన్స్ వ్రాస్తాను అంటే ఆమాటకు అర్థం ఏమిటి ? రాగద్వేషముల నుండి విడుదల పొందనివాడికి ఆత్మజ్ఞానం ఏమిటి ? ముందు నీమనస్సును ప్రిపేర్ చెయ్యి మనస్సు ఫిట్ అవ్వకుండా ఫిట్ అయ్యిందనుకుంటున్నాము. నువ్వు ఆత్మస్తుతి, పరనింద అక్కడ పెట్టుకుని నేనుఏదో యోగాభ్యాసం చేస్తున్నాను, నాకు ఆత్మజ్ఞానం కావాలి అంటే ఎలా వస్తుంది. మనం రోజూ నోరుపాడు చేసుకోవటం. మన నోరు మంచిది కాదు, చూపు మంచిది కాదు, మనస్సు మంచిది కాదు ఇంక ఆత్మజ్ఞానం ఏమిటి ? గాంధీ గారికి మూడు కోతుల బొమ్మ గురువు, మనం కూడా మూడు కోతుల బొమ్మను గురువుగా చేసుకోవాలి. మేము ప్రారబ్దమును అనుభవిస్తున్నాము అని పేదవారు

అంటున్నారు, ధనవంతులు అంటున్నారు. అసలు ప్రారబ్దమును అనుభవించటం ఏమిటయ్యా? ప్రారబ్దం నిజం అనుకుంటున్నావు, ప్రారబ్దం నిజం కాదని నీకు తెలిస్తే ఇంక అనుభవించటం ఏమిటి అంటున్నారు. నువ్వు ఈ భూమి మీద తిరుగుతుండగానే రాగద్వేషముల యొక్క వేగం తగ్గించుకుని మిధ్యానేనును ఎంతవరకు రెడ్యూస్ చేసుకోగలవో అంతవరకు రెడ్యూస్ చేసుకుంటూ రావాలి. నీకు బాహ్యంగా అనుకూలమైన పరిస్థితులు వచ్చినప్పడు పొంగిపోకు, గర్వం రానివ్వవద్దు అలావస్తూ ఉంటే మిధ్యానేను పెరిగిపోతూ ఉంటుంది. దేహానికి ఫుడ్‌సప్లయి ఆపుచేస్తే దానంతట అదే నేచురల్‌గా చనిపోతుంది అలాగే మిధ్యానేనుకు ఆహారం సప్లయి చేయటం మానివేస్తే దానికి నేచురల్‌గా, నార్మల్‌గా డెత్ వచ్చేస్తుంది, అప్పడు నీవు జ్ఞానివి అవుతావు. నువ్వు ఎన్నో దోషాలు ఉన్నాయనుకొంటున్నావు గాని ఉన్నదల్లా ఒక్కటే దోషం, ఇప్పడు నీవు ఏదైతే నేను నేనుఅంటున్నావో అదే దోషం. మూకిడి తీసివేస్తే కుండలో ఉన్న అన్నం ఎలా కనబడుతుందో అలాగ మిధ్యానేనును కనుక తీసివేస్తే నీకు నిజమైననేను తెలుస్తుంది, అది తెలిసే వరకు నీకు ఫ్రీడమ్ లేదు, ఆనందం లేదు, శాంతి లేదు, పునర్జన్మలోనుండి విడుదల పొందలేవు, ఇందులో రాజీ లేదు, నేను అది సాధించాను, ఇది సాధించాను అంటున్నావు కదా, అలా అనుకునేవాడు ఒకడు ఉన్నాడు కదా వాడిని తీసి ఒక ప్రక్కన పెట్టు, అప్పటివరకు నీకు స్వేఛ్ఛలేదు, స్వాతంత్రం లేదు. నువ్వు ఏదో సాధన చేస్తున్నావు కాని ఆసాధనలో ఈమిధ్యానేనును ఇన్వాల్వ్ చేయటంలేదు. దానిని ఇన్వాల్వ్ చేస్తేగాని అది నశించదు. నువ్వు వాడేమందుకు రోగానికి సంబంధం ఉండాలి, అలా అయితే రోగం తగ్గుతుంది. సాధనలో మిధ్యానేనును ఇన్వాల్వ్ చేస్తే అది నశిస్తుంది. ఓం సాధుగారుఏమని చెపుతున్నారంటే దేహం అక్కరలేకుండా నీవు సుఖపడవచ్చు. గాఢనిద్రలో నీకు దేహం గొడవలేదు. కాని నీవు సుఖంగా ఉన్నావుకదా. దేహం సహాయం లేకుండా గాడనిద్రలో నీవు సుఖంగా ఉన్నావు దానిని జాగ్రదవస్థలో ప్రాక్టీసు చెయ్యి అంటున్నారు. మమ్మల్ని ఎలా బ్రతకమంటారు అని భగవాన్‌ను అడుగుతూ ఉండేవారు దానికి భగవాన్ ఏమిచెప్పారు అంటే చనిపోయినవారిలా బ్రతకండి అని చెప్పేవారు. దాని అర్థం ఏమిటంటే చనిపోయినవాడి దగ్గరకు మనం వెళ్ళి వాడిని పొగుడుతాము అనుకోండి వాడికి ప్లెజర్ రాదు, వాడిని తిడతాము అనుకోండి వాడికి పెయిన్ రాదు, బ్రతికి ఉండగా మనం అలా తయారవ్వాలి. నిన్ను పని చేసుకోవద్దని భగవాన్ చెప్పటం లేదు, నీవు మాట్లాడే మాటల వలన, నీవు చేసే పనుల వలన, నీకు వచ్చే ఆలోచనల వలన దేహంతో తాదాప్యం పొందే తలంపు రెడ్యూస్ అవుతూ ఉండాలి, అది రెడ్యూస్ అవ్వదు అనుకో నీవు ఏమి సాధించినా





అది ఒకటి లేని సున్నతో సమానము. మనం ఏమనుకుంటున్నాము అంటే అందరూ మనలను ప్రేమించాలి కాని మనం ఎవరిని ప్రేమించకూడదు, అందరూ మనకు సేవ చేయాలి కాని మనం ఇతరులకు సేవ చెయ్యము, అందరూ మనలను గౌరవించాలి కాని మనం ఇతరులను గౌరవించము, అంతా పరస్పర విరుద్ధం, అసలు మన ఆలోచనలోనే లోపం ఉంది సత్పురుషులతోటి, మహాత్ములతోటి మనకు ఎటాచ్‌మెంట్ కనుక ఉంటే మన శరీరం చనిపోకముందే మనం డిఫరెంట్ వరల్డ్‌లోకి వెళ్ళిపోతాము, ఆనందంలోనికి, శాంతిలోనికి డోర్సు ఓపెన్ అవుతూ ఉంటాయి. అందుచేత చేసే స్నేహాల విషయంలో, చదివే పుస్తకాల విషయంలో బహు జాగ్రత్తగా ఉండాలి. మీరు సత్వగుణాన్ని ప్రాక్టీస్ చెయ్యాలి, యాక్షన్ పెంచుకోవాలి, రియాక్షన్ తగ్గించుకోవాలి. పనిలో భగవంతుని చూడటం నేర్చుకోవాలి. ప్రతీవాడి జీవితంలో అప్స్, డౌన్స్ వస్తూ ఉంటాయి. అప్స్ మనకు నేర్పే పాఠాలు ఉంటాయి, డౌన్స్ మనకు నేర్పే పాఠాలు ఉంటాయి. కాని ఒక్క విషయం మీరు మిస్ అవ్వవద్దు. మీకు నేర్చుకొనే శక్తి ఉంటే జీవితంలో జరిగే ప్రతిసంఘటనలో కూడా పాఠం ఉంటుంది. ఆసంఘటన భగవంతునికి తెలియకుండా రావటం లేదు, దానిలోనుండి నీవు పాఠం నేర్చుకుంటే ఆధ్యాత్మికంగా నీవు అభివృద్ధిలోనికి వస్తావు. అలా పాఠం నేర్చుకోలేదు అనుకో నీవు వికాసం పొందలేవు. మీరు నోరుపాడుచేసుకోకుండా, మనస్సుపాడు చేసుకోకుండా ముందుగా ఆపుచేసుకుంటూ ఉంటే, ఇలాకొంతకాలం ప్రాక్టీస్‌చేస్తే అప్పడు లోపలఉన్న సౌందర్యం నీకు తెలుస్తుంది, తెలిసిన వెంటనే అది పర్మనెంట్ అవ్వదు తరువాత కొంతకాలానికి అది పర్మనెంట్ అవుతుంది. ఎప్పడైనా సుఖం, శాంతి నీకు తెలియవచ్చు అది టెంపరరీగా జరుగుతుంది, మనోనాశనం అయిన తరువాత అది పర్మనెంట్ అవుతుంది. నెగిటివ్ తింకింగ్ వదిలెయ్యండి, పాజిటివ్ తింకింగ్ పెంచుకోండి. పాజిటివ్ తింకింగ్



పెంచుకొంటూ ఉంటే మీకు ఆత్మవిశ్వాసం కలుగుతుంది, ఆత్మవిశ్వాసం మీకు ఆత్మజ్ఞానాన్ని పట్టి ఇస్తుంది. నేను బాగా సాధన చేస్తున్నాను అనుకోండి, సాధన చేసేటప్పుడు లోపల గౌరవాన్ని ఆశిస్తున్నాను అనుకోండి అంటే నేను ఉండాలని నీ మనస్సు కోరుకుంటోంది అని అర్థం. నిన్ను నీవు వంచన చేసుకోవద్దు, అలా వంచన చేసుకుంటే నష్టపోయేది నువ్వే. అందుచేత నిన్ను నీవు పరిశీలించుకో, లోచూపు నేర్చుకో, సత్పురుషులతో సహవాసం చెయ్యి. సత్పురుషులతో సహవాసం వలన నీకు లోచూపు కలుగుతుంది. స్వామీ వివేకానంద ఏమి చెప్పారు అంటే ఆకాశంలో సూర్యుడు ఉన్నాడు, ఉన్నంత మాత్రంచేత ఆయన నీకు కనబడడు, నీమొఖం అటుత్రిప్పాలి అలాగే నీలోపల జ్ఞానసూర్యుడు ఉన్నాడు, ఉన్నంత మాత్రం చేత ఆయన నీకు కనబడడు, రవ్వంత నీమనస్సును అటు త్రిప్పాలి. అంతర్‌దృష్టి లేనివాడికి ఆత్మజ్ఞానం కలుగనే కలుగదు. బాహ్యంగా నీవు ఒకవేళ మంచిపనులు చేసి అహంభావనను పెంచుకుంటూ ఉంటే నీకు పుణ్యం వస్తుంది గాని ఆత్మజ్ఞానం మటుకు రాదు. నువ్వు సాధన చెయ్యి, సాధన చెయ్యి, సాధన విడిచిపెట్టవద్దు. అందులో ఏమీలేదు అని తెలిసేవరకు నువ్వు సాధన చెయ్యి..

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 4-12-03, అరుణాచలం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

తల్లి బిడ్డలకు మంచిని ఎలా బోధిస్తుందో అలాగ అర్జునుడిని అడ్డుగా పెట్టుకొని భగవంతుడు మానవజాతికి గీతను ఉపదేశించాడు. మనకు దుఃఖంవస్తే రోగంవస్తుంది కాని అర్జునుడికి దుఃఖం వస్తే జ్ఞానంవచ్చింది. మనం మనకోసం ఏడుస్తాము కాని అర్జునుడు అందరికోసం ఏడ్చాడు. అందరికోసం ఏడ్చేవాడికి జ్ఞానంవస్తుంది, ఎవరికోసం వాడే ఏడిస్తే రోగం వస్తుంది. గీతలో మొదటి అధ్యాయం అర్జునవిషాదయోగం, పునాది అంతా మొదటి అధ్యాయంలోనే ఉంది. మనదుఃఖం యోగం అవ్వదు, కాని అర్జునుడి దుఃఖం యోగం అయ్యింది, అది సమిష్టిదృష్టి. అర్జునుడు అంటే తెల్లటివాడు, శరీరం తెలుపుకాదు మనస్సులో తెలుపు, మనస్సులో ఎవరైతే తెల్లగా ఉంటారో వారికిజ్ఞానం వస్తుంది. అర్జునుడు అనేక యుద్ధాలు చేసాడు. కురుక్షేత్రయుద్ధం ప్రారంభంలో అర్జునుడికి పిరికితనం వచ్చింది అని కొంతమంది చెపుతారు. అన్ని యుద్ధాలు చేసినవాడికి పిరికితనం ఏమిటి?





అది పిరికితనం కాదు, మంచితనం. యుద్ధభూమిలో అంతమంది పెద్దవారిని చూసి వీరిని అందరిని చంపి రాజ్యంసంపాదించి దానిని మనం ఏమిచేసుకొంటాము అని మంచితనం వలన అతనికి దుఃఖంవచ్చింది, అంతేగాని భయపడి దుఃఖంరాలేదు. అర్జునా నీవు అనసూయుడవు, నీలో ఉన్న ఆగుణానికి ఆకర్షింపబడి నీకు గీతా శాస్త్రాన్ని చెపుతున్నాను అని భగవంతుడు చెప్పాడు. మనం ఈశ్వరుడిని పూర్తిగా నమ్ముతూ ఉంటే, ఆయన మీద మనకు విశ్వాసము ఉంటే మనకు వివేకం లేకపోయినా మనకు వివేకాన్ని ఇచ్చి ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు, విశ్వాసానికి అంత బలముఉంది. కృష్ణుడికి అర్జునుడు చుట్టము, స్నేహితుడు, సహచర్యుడు, భక్తుడు, నమ్మకస్తుడు. బంధుత్వం ఎలా ఉండాలంటే కృష్ణార్జునులు ఉదాహరణ. అర్జునుడు యొక్క ఆలోచనలో ఎక్కడైనా తేడా వస్తూఉంటే ఆ ఆలోచనా విధానాన్ని వెంటనే కరెక్టు చేసేవాడు. చివరిది మోక్ష సన్యాసయోగం, చెప్పిచెప్పి చివరకు మోక్షానికి కూడా సన్యాసం ఇచ్చేయమన్నాడు. మనం మోక్షానికి సన్యాసం ఇవ్వము కాని బట్టలకు సన్యాసం ఇస్తాము. మోక్షం ఎప్పడు వస్తుంది అని ఎదురు చూడకు, మీరు కంగారుపడినంత మాత్రం చేతరాదు, అది ఎప్పడు ఎలా జరగాలో అది అప్పడు అలాజరుగుతుంది. అధర్మాన్ని ఎలాగూ విడిచిపెడతావు, నాకోసం ధర్మాన్నికూడా విడిచిపెట్టు అని కృష్ణుడు అర్జునుడితో చెప్పాడు. కృష్ణుడికి నిరంతరం బ్రహ్మంతో తాదాప్యం, ఆయన ఏపనిచేస్తున్నా బ్రహ్మంతో తాదాప్యం, ఉన్నవస్తువుతో 24 గంటలు తాదాప్యం, వాడు ఉపవాసి. ఉపవాసి ఎవరు చేతులు ఎత్తమంటే అన్నంతినకుండా ఉపవాసం ఉన్నవారు చేతులు ఎత్తడానికి బయపడేవారు, కృష్ణుడు అప్పడే భోజనం చేసివచ్చి ఉపవాసి ఎవరు అంటే చేతులు ఎత్తేవాడు. సాధన అంటే కొంపలు కాల్చమని, మీ తలకాయలు విషపూరితం చేయమని కాదు. కోరిక, కోపం, భయం ఈ మూడు విడిచిపెట్టమని, యజ్ఞదానతపస్సులు మూడు ఆచరించమని భగవంతుడు చెప్పాడు, అదే సాధన అన్నాడు. కోరిక, కోపం, భయం వీటిని విడిచిపెట్టలేకపోతే ఈ జన్మలోనే కాదు రాబోయే జన్మలో కూడా దుఃఖం నిన్ను విడిచిపెట్టదు. భగవాన్ ఏమి చెప్పారు అంటే ఇవి మూడూలేవు, ఒకటే అన్నారు కోరికనుండి భయం, కోపం వస్తాయి. కోరిక తీసివేస్తే భయం లేదు, కోపం లేదు అన్నారు. స్వార్థం లేకుండా అహంకారం లేకుండా ఏపనిచేసినా అది యజ్ఞంతో సమానం. సమాజక్షేమంకోసం ఆధ్యాత్మిక వికాసం కోసం నీవు ఏపనిచేసినా అదే యజ్ఞము, నీవు అలా పనిచేస్తూఉంటే నీ చైతన్యస్థాయి పెరుగుతూ ఉంటుంది, క్రమంగా జీవుడు వెళ్ళి చైతన్యంలో ఐక్యమవుతాడు. నీకు ఉన్నదానిలో ఎంతోకొంత ఇతరులకు ఇవ్వటం అలవాటు చేసుకో దానివలన ఈశ్వరుని దయకు పాత్రుడవు అవుతావు. మనకు తినటం అలవాటు

ఉందికాని ఇవ్వటం అలవాటు లేదు. కేవలం చదువు వలన, మన తెలివివలన, గౌరవాల వలన బుద్ధిలో ఉన్నదోషాలు నశించవు. బ్రహ్మానుభవం పొందటానికి మన బుద్దిలో ఉన్న ఏదోషాలు అయితే అడ్డువస్తున్నాయో అవి తపస్సు వలన నశిస్తాయి. తపస్సు చేయటం వలన వ్యక్తిభావన తగ్గుతుంది, సమిష్టిభావన పెరుగుతుంది, బుద్దిలోఉన్న దోషాలు నశిస్తాయి, నీవు బ్రాహ్మీస్థితిని పొందుతావు. ఎవరైనా మనల్ని నిందిస్తున్నారు అనుకోండి. మనలను మనమే నిందించుకొంటున్నాము, ఎవరైనా మనల్ని స్తోత్రం చేస్తున్నారు అనుకోండి, మనలను మనమే స్తోత్రం చేసుకొంటున్నాము. ఉన్నది ఒక్కటే, ఉన్నది ఈశ్వరుడే, ఆయన తప్పించి ఏమిలేదు అని మనకు అర్ధమయితే మనస్సు యొక్క చాపల్యంతగ్గుతుంది, ఇప్పడే ఇక్కడే మనస్సువెళ్ళి హృదయగుహలో పడిపోతుంది.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 5-12-03, అరుణాచలం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఇంద్రియాల ద్వారా గ్రహించే జ్ఞానాన్ని అంతం చేసి, సదా విజృంభిస్తున్న మనోవ్యాపారాలను అణచి, నేత్రాలకు కనబడని హృదయంలో ప్రజ్ఞా రూపమైన ప్రకాశాన్ని, చెవులు వినలేని నిశ్శబ్దరూపమై ఉన్నానుఉన్నాను అనే ఆత్మస్ఫురణను చక్కగా గ్రహించుటయే నిజమైనయోగశక్తి. మన ఇంద్రియాలతో గ్రహించే జ్ఞానం అంతాకూడా సాపేక్షిక జ్ఞానం అంటారు. సాపేక్షికజ్ఞానం వేరు, ఆత్మజ్ఞానం వేరు. ఆత్మజ్ఞానం ఇంద్రియాలకు, మనస్సుకు అందేది కాదు. ఇంద్రియాలు, మనస్సు పరిపూర్ణంగా ఎక్కడైతే అణుగుతున్నాయో అక్కడ ఆత్మజ్ఞానం ఉదయిస్తుంది. చేతులు పూజమీద, చిత్తము చెప్పల మీద అని ఒక సామెత ఉంది. ఇప్పడు మన పరిస్థితి అలాగే ఉంది. ఎక్కడైతే దేహం ఉందో అక్కడ మనస్సు ఉంటేనే విద్య వస్తుంది. ఇంద్రియాల చేత గ్రహింపబడిన విద్యలు అన్నీకూడా మనం ఎవరిమో మనకు తెలియచెప్పలేవు. మనం ఏదిగా ఉన్నామో అక్కడకు ఈవిద్యలు తీసుకుని వెళ్ళలేవు. ఇవి మన దేహానికి కంఫర్ట్ తీసుకుని వస్తాయి అంతే. మీలో తెలివైనవారు ఉండవచ్చును కాని లోపల ఉన్న సద్వస్తువు తెలివిచేత గ్రహింపబడేది కాదు. మనస్సుకు చాపల్యం ఎక్కువగా ఉంటుంది. గాలిని మూట కట్టటం ఎంత కష్టమో మనస్సును నిగ్రహించటం కూడా అంతే కష్టం అని చెపుతారు. మీకు నచ్చిన పద్ధతిలో సాధన చేసుకోండి కాని ఒకటి మాత్రం





దృష్టిలో పెట్టుకోండి మీరు చేసే సాధన వలన మీకు మనోనిగ్రహం రావాలి. మనోనిగ్రహం ఆత్మజ్ఞానానికి సహకరిస్తుంది. మనం శరీరానికి కంఫర్టు చూసుకొంటున్నాము గాని మనస్సు యొక్క కంట్రోలు చూసుకోవడం లేదు. మనోనిగ్రహం లేకపోతే మనస్సుకు సంబంధించిన వ్యాపారం ఆగదు. అభ్యాసం లేకుండా, వైరాగ్యం లేకుండా నీకు మనస్సు స్వాధీనంలోకి రాదు. నిజమైన అరుణాచలం నీ హృదయంలోనే ఉంది. కాని అది నీమనస్సుకు అందదు, ఇంద్రియాలకు అందదు, నీతెలివితేటలకు అందదు. నాకు ఇంద్రియాలు ఉన్నాయి, నాకు తెలివి ఉంది. నాకు ఎందుకు తెలియదు అని నీ ఇంద్రియాల ద్వారా నీవు ప్రయత్నం చేస్తే లోపలకు కొంతదూరం వెళ్ళి వస్తువుమనకు దొరకదు అనితెలిసాక వెనక్కి వచ్చేస్తాయి. కొన్ని గుడ్డిగేదెల మధ్యన ఒక గూనెగేదె ఉందట. గుడ్డిగేదెలతో పోల్చుకుని వీటి అన్నిటికంటె నేను గొప్పదానిని అనుకొందట. మన పరిస్థితి కూడా అలాగే ఉంది, గుడ్డిగేదెల మధ్యన గూనెగేదెలా ఉన్నాము. మనకంటే బుద్ధి తక్కువ వారితో సహవాసం చేస్తూఉంటే మనం ఎలా బాగుపడతాము, మనకు ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది. మనకంటె బుద్ధిమంతులతోటి, వివేకవంతులతోటి స్నేహం చేస్తే మనం అభివృద్ధిలోకి వస్తాము. కాఫీ త్రాగేటప్పడు పైన ఉన్న నురగ ముందు పెదమలకు తగులుతుంది, ఆనురగ కాఫీ కాదు, నురగ తగిలాక తరువాత కాఫీ నాలుకకు తగులుతుంది, కాఫీ రుచిని ఈనురగ చెపుతూ ఉంటుంది, నురగ అడుగున కాఫీ ఉంది. మనకు ఇంకా నురగే తగలడంలేదు, ఇంక కాఫీ రుచి ఏమితెలుస్తుంది? అసలు మనం నురగదాకా అయినావెళ్ళాలి కదా. లోపల ఉన్న సత్యం నిశ్శబ్దంగా ఉంటుంది, దానికి ద్వితీయం లేదు, వారు ఉన్నారు, వారిని తెలుసుకోవటానికి ఎల్లమ్మ, పుల్లమ్మ సహాయం అక్కరలేదు. వారు అంతటా ఉన్నారు, నీలోపల ఉన్నారు, వారి స్వరూపమే ఆనందం, వారు ఉండటం వలననే వారు తెలియబడతారు, అదీ చైతన్యం. మనం నిప్పను ముట్టుకోనక్కరలేదు, కొంత దూరం వెళ్ళేటప్పటికి మనకు వేడి తెలుస్తూ ఉంటుంది. అలాగే లోపలకు వెళ్ళేటప్పటికి చైతన్యం తాలుక ఆనందం, శాంతి మనకు తెలుస్తూ ఉంటుంది మీకు వ్యతిరేకమైన సంఘటనలు జరిగినప్పడు దుఃఖం వస్తుంది, అనుకూలమైన సంఘటనలు జరిగినప్పడు ఆనందం వస్తుంది. కాని లోపలకు వెళ్ళినవాడికి ఇవిరెండూ ఆగిపోతాయి. బాహ్యా సంఘటనలకు స్పందన వస్తోంది అనుకోండి నీవు లోపలకు వెళ్ళలేదని అర్థం. ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు.లేనిది లేనట్లు నీకు తెలిసేవరకు ఉన్నది ఏదో నీకు తెలియదు. నీవు ఏదిగా ఉన్నావో దానిలో నిన్ను ఐక్యపరచడమే యోగం యొక్క ప్రయోజనం.నేను తెలివైనవాడిని, నేను మంచివాడిని అని మీరు అనుకుంటూ ఉంటే ఆతెలివిని, మంచిని మీరు దాటలేరు, అక్కడే ఆగిపోతారు. ఓరీ బుద్ధి తక్కువవాడా నీకు

తెలివితేటలు ఉంటే ఉండవచ్చును, నీవు మంచివాడివి అయితే అవ్వవచ్చును,అదే నువ్వు కాదు, గాఢనిద్రలో ఎవరైనా నేనుతెలివైనవాడిని, నేను మంచివాడిని అనుకొంటున్నారా ? వీటి అన్నింటికి అతీతంగా సద్వస్తువు ఉంది, అది ఎక్కడో కాదు నీహృదయంలోనే ఉంది. నీప్రాణానికి ప్రాణంగా, నీమనస్సుకు ఆధారంగా లోపల సద్వస్తువు ఉంది. నీతెలివితేటలకు అందటం లేదని ఆవస్తువు లేదు అనుకోవద్దు. నీకు అర్థం కావటంలేదని అది లేదు అనుకోవద్దు, అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. ఇంద్రియాల ద్వారా వచ్చే జ్ఞానం అంతా పొల్లు,అవిగింజలు కాదు. నీవు పొల్లును గింజలనుకొని అక్కడ ఆగిపోకు, అసత్యాన్ని సత్యం అనుకొని అక్కడ ఆగిపోవద్దు. ఇదికాదు ఇదికాదు అని యోగశక్తితో గెంటుకొంటూ వెళ్ళు. వివేకంతో, విచక్షణాజ్ఞానంతో ఇదికాదు ఇదికాదు అని గెంటుకొంటూ వెళితే నీవు ఏదిగా ఉన్నావో అది, నేను ఉన్నాను అని లోపల నీకు స్ఫురిస్తుంది.ఆఉండటమనేది నీదేహానికి పరిమితం కాదు, మనస్సుకు పరిమితం కాదు, లోకానికి పరిమితం కాదు. నేను ఆత్మ దగ్గరకు వెళ్ళలేకపోతున్నాను, కళ్యాణ గుణాల వద్ద ఆగిపోతున్నాను. ఈకళ్యాణ గుణాలయొక్క సౌందర్యమే మనస్సు భరించలేకపోతోంది, మనస్సు ఇక్కడే ఆగిపోతోంది. ఇంక లోపల ఉన్న బ్రహ్మంలో ఎంత సౌందర్యం ఉంటుందో. ఇంకా మనం వంట ఇంట్లోకి వెళ్ళలేదు, వీధి అరుగుమీద కూర్చున్నాము, మా అంచనా మేము చెపుతున్నాము, మీ అంచనా మీరు వేసుకోండి.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 6-12-2003

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం ఏదైనా మందు వాడుతూ ఉంటే అది పనిచేస్తోందా లేదా అని చూసుకొంటూ ఉంటాము, పనిచెయ్యకపోతే మందు మార్చుకొంటాము. మందు మందు కోసమే ఎవరూ వాడరు, రోగం తగ్గటానికి వాడతారు. అలాగే మనం చేసే సాధన వలన అజ్ఞానం తగ్గుతోందో లేదో చూసుకోవాలి. ఇప్పుడు మనందరికి దేహంతో తాదాప్యం సహజంగా ఉంది. దేహమే కనుక మనం అయితే దేహంతో తాదాప్యం పొందటం తప్పలేదు.కాని దేహం మనం కాదు. మీరు భక్తి మార్గంలో ప్రయాణం చేసిన, జ్ఞాన మార్గంలో ప్రయాణం చేసినా, మీరు ఏమార్గంలో ప్రయాణం చేసిన, మీరు ఏమతస్థులైన ఇబ్బంది లేదు. సబ్జక్ట్‌ను ప్రోపర్‌గా అర్థం చేసుకోండి. సబ్జక్టుకు కులమతాలతో సంబందంలేదు.

**05-01-2004**

సూర్యుడికి కులం ఏమిటి ? మతం ఏమిటి . అన్నిమతాల వారికి సమానంగా వెలుగును ఇస్తాడు. జ్ఞానానికి కులం, మతం లేదు. జ్ఞానం పొందటానికి అర్హత, యోగ్యత ఉండాలి. మన మనస్సు పక్వానికి వస్తే, పండు అయితే మనకు జ్ఞానం వస్తుంది, మనస్సు పచ్చిగా ఉంటే మనకు జ్ఞానం రాదు. మనం ఏదైనా వస్తువు నోట్లో పెట్టుకుంటే పుల్లగా ఉంటే ఊసేస్తాము, తియ్యగా ఉంటే తింటాము. అలాగే మనం తియ్యగా ఉంటే, మనం పక్వానికి వస్తే భగవంతుడు మనలను స్వీకరించి ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు, పుల్లగా ఉంటే మనలను వదిలేస్తాడు. అంటే మనం చేదుగా, పుల్లగా ఉండకూడదు, మనం తియ్యగా తయారవ్వాలి. మనం సాధన ఎలా చేసుకోవాలి అంటే చైతన్యం అంతటా ఉంది, అంతటా ఉన్నదే మన హృదయంలో కూడా ఉంది. అది దేశకాలాలకు అతీతం, జయాపజయాలకు, కష్టసుఖాలకు అతీతం. అదే మన నిజమైన ఇల్లు. పక్షి రెక్కలు ఆడించుకొంటూ అలా ఎగురుతూ ఉంటుంది అది తన గూట్లోనికి వచ్చిన తరువాత అమ్మయ్య అనుకొంటుంది. అప్పడే దానికి విశ్రాంతి. అలాగే మన శరీరం పుడుతోంది చనిపోతుంది, ఇలా అనేక శరీరాలు వస్తున్నాయి, పోతున్నాయి. మన నిజమైన ఇంటికి మనం వెళ్ళలేదు. మన నిజమైన ఇంటికి మనం చేరుకొనేవరకు ఈ తిరగటాలు మనకు తప్పవు.మన నిజమైన ఇల్లు మన హృదయ గుహలో ఉంది, అక్కడకు మనం చేరుకోవాలి. సాధనలో ఎవరి అంతట వారు చూసుకోవాలి, ఇతరులు చెప్పనక్కరలేదు. మనకు చైతన్యంతో తాదాప్యం వస్తోందా ? లేక దేహంతో అంటే మనం కానిదానితో మనకు తాదాప్యం వస్తోందా ?అని మనం చూసుకోవాలి. మీరు సాధన చేసేటప్పుడు మనోదేహములతో తాదాప్యం తగ్గుతూ ఉండాలి, చైతన్యంతో తాదాప్యం పెరుగుతూ ఉండాలి. అలా జరుగుతోందో, లేదో మీరు లోపల చూసుకోవాలి. దేహంతో కనుకతాదాప్యం పెరుగుతూ ఉంటే సాధనలో ఎక్కడో పొరపాటు ఉందని అర్థం. చైతన్యం తోటి తాదాప్యం పెరుగుతూ ఉంటేఅది కరెక్టు సాధన అంటే మీరు రైట్‌పాత్‌లో ఉన్నట్లు లెక్క. మీ మనస్సే మీకు మిత్రుడు, మీ మనస్సే మీకు శత్రువు అని భగవంతుడు గీతలో చెప్పాడు మీ మనస్సు మీకు మిత్రుడుగా ఉంటే మీకు ఎంత మంది విరోధులు ఉన్నకూడా వారు మిమ్మల్ని ఏమీ చేయలేరు, చేసే సహకారం అంతా మీమనస్సే చేసిపెట్టేస్తుంది. మీమనస్సు మీకు శత్రువుగా ఉంటే మీ బంధువులు అందరూ కలిసి మిమ్మల్ని సుఖపెట్టాలన్నా సుఖపెట్టలేరు, మీమనస్సు మిమ్మల్ని సుఖపడనివ్వదు. ఎవడి మనస్సు వాడికి శిక్ష అంటారు పెద్దలు. మీమనస్సును మీరు మిత్రుడిగా చేసుకోండి, మచ్చిక చేసుకోండి, స్వాధీనం చేసుకోండి, దానికి మంచినేర్పి, వినయం నేర్పి చైతన్యంతో తాదాప్యం పొందేటట్లు సమాయత్తం చేయండి, అదే సాధన యొక్క ప్రయోజనం.

**రమణ భాస్కర**

తెలివైనవారు అందరూ బుద్ధి దగ్గర ఆగిపోతున్నారు, మనం మొద్దులం కాబట్టి దేహందగ్గర ఆగిపోతున్నాము. వాళ్ళు ఆగడప దగ్గర ఆగిపోతున్నారు, మనం ఈ గడప దగ్గర ఆగిపోతున్నాము, మొత్తం అందరమూ అజ్ఞానంలో ఉంటున్నాము.ఇప్పుడు నీవు దేహంతో ఎంత సహజంగా తాదాప్యం పొందుతున్నావో అంత సహజంగా నీహృదయంలోఉన్న సత్యంతోటి నువ్వు తాదాప్యం పొందిన రోజున నీవు మోక్షాన్ని పొందుతావు, మనం సాధన చేయవలసినది దానికోసమే, ఉన్నది అదే.అది తెలియబడేవరకు ప్రతీ మానవుడిని దు:ఖం, అశాంతి వెంటాడుతూఉంటుంది. ఎవరైతే భగవంతుడు చెప్పినట్లు నడుచుకుంటున్నారో వారికి భగవంతుడు తన స్వరూపాన్ని ఇస్తాడు. మనం భగవంతుడిని పూజిస్తాము, అర్చన చేస్తాము, భగవంతుడిని జపిస్తాము కాని లోపల ఏమనుకొంటాము అంటే ఆయనకంటే మనమే తెలివైనవారము అనుకొంటాము అందుచేత ఆయన సంకల్పాన్ని అంగీకరించలేక పోతున్నాము. ఒకోసారి పెద్దకష్టం వచ్చి మినెత్తిమీద పడినట్లు ఉంటుంది. ఆకష్టాన్ని చూసి మీరుకంగారు పడతారు. ఆ కష్టం మీకు వచ్చినట్లు భగవంతుడికి తెలుసు. ఆ కష్టాన్ని అలా చూపించి మీ జీవితాన్ని భగవంతుడి వైపు త్రిప్పి, సాధన చేయాలనే బుద్ధిని కలుగజేసి, మీరు సుఖస్వరూపం పొందటానికి ఆ కష్టాన్ని పెట్టుబడిగా పెట్టి మిమ్మల్ని నిజమైన సుఖిచేస్తాడు. అందుచేత కష్టంకూడా ఈశ్వరుని ప్రసాదమే. మీరు ఉన్నారు అని అరుణాచలం వచ్చాము అని భగవాన్‌తో ఎవరైనా అంటే నన్ను ఎవరైతే అరుణాచలం తీసుకొని వచ్చారో వారే మిమ్మల్ని అరుణాచలం తీసుకొని వచ్చారు. నాకు ఎవడైతే జ్ఞానం ఇచ్చాడో వాడే మీకు కూడా జ్ఞానం ఇస్తాడు. నాకు ఇచ్చినవాడు వేరు, మీకు ఇచ్చినవాడు వేరుకాదు, ఉన్నది ఒక్కటే అనేవారు. సాధన చేసేవాడు నూటికి నూరుపాళ్ళు సుఖంగా, శాంతిగా ఉండలేడు ఎందుచేతనంటే అక్కడ ప్రయత్నం ఉంది. నీవు చేసే ప్రయత్నం, ప్రయత్నంలేనిస్థితికి తీసుకొనివెళ్ళే వరకు నీవు సుఖంగా, శాంతిగా ఉండలేవు కాని మాట వరసకు నేను సుఖంగా ఉన్నాను అని నీవు నోటితో చెపితే చెప్పవచ్చును. సాధన అనేది సహజస్థితికాదు. సాధన చేసేది మనస్సు, అది ఉన్నంత సేపు నిన్ను ఏడిపిస్తూ ఉంటుంది. మనస్సు సాధన చేస్తున్నట్లు నటిస్తుంది ఎందుచేతనంటే నిజంగా సాధనచేస్తే అది చనిపోతుంది అని దానికి తెలుసు. ప్రయత్నం చేసి, ప్రయత్నం చేసి మనం ప్రయత్నంలేని స్థితిని పొందినప్పడు సుఖంగా, శాంతిగా ఉంటాము. ప్రాపంచిక సంఘటనలకుగాని, నీ ప్రారబ్ధం తీసుకొని వచ్చే సంఘటనలకుగాని నీమైండ్ అప్‌సెట్ అవుతూ ఉంటే నీవు సహజస్థితిలో లేవు అని అర్ధం, అంటే నీవు దేహం యొక్క పరిధిలో ఉన్నావు. గౌతమ బుద్ధుడి దగ్గరకు వెళ్ళి కూర్చొన్నవారికి అనేకమందికి జ్ఞానం వచ్చిందట కాని ఆయన కూడా






తిరిగే సవతితమ్ముడు ఆనంద్‌కు జ్ఞానం రాలేదట కారణం ఏమిటి అంటే ఆయనను చూడటానికి వచ్చినవారు ఇష్టాలు అయిష్టాలు ప్రక్కన పెట్టి బుద్ధుడిని చూసేవారు, సహజంగా బుద్ధుడిలో ఏది ఉందో అది స్వీకరించారు అందుకువారికి జ్ఞానం కలిగింది. సవతితమ్ముడు మంచివాడే కాని వాడు బుద్ధుడిలో ఉన్న వైభవం చూడటం మానివేసాడు, వాడు మాఅన్న అనేబుద్ధి అతనికి పోలేదు. దేహము ఉంటే అన్నయ్య, బుద్ధుడు అంటే ఆదేహమా? వీడు మా అన్నయ్య అనే చిన్న బుద్ధి అతనికి జ్ఞానం రాకుండా ఆపుచేసింది, ఆచిన్నతలంపు వలన అతను లోపలకు వెళ్ళలేకపోయాడు. అతనికి బుద్ధుడితో సహవాసం ఉందికదా, లోపల కొంత వివేకం ఉంది, ఏమిటి అందరూ ఇంత ఆనందంగా ఉంటున్నారు, మన ముఖం ఏమిటి ఇలా ఉంది అని ఆనంద్‌కు అనుమానం వచ్చింది. బుద్ధుడు శరీరం విడిచిపెట్టాక సాధనచేసి దేహభావన వలననే ఇంతవరకు మనం ఇలా ఉన్నాము అని గ్రహించి దేహభావనను పోగొట్టుకొన్నాడు, జ్ఞానం పొందాడు. బుద్ధుడు చెపుతూ ఉండేవాడు మీ అంతట మీరు ప్రయత్నం చేయగలిగితే, ప్రయత్నంచేసి బాగుపడండి, జ్ఞానం పొందండి. కాని మీకు తెలియకపోతే, దారి కనబడకపోతే అప్పడు నా మాటను ప్రమాణంగా తీసుకోండి అని చెప్పాడు. అన్ని వాసనలకంటే దేహవాసన బలీయమైనది, అది మనిషిని ఎక్కువ పీడిస్తుంది. ఆ దేహభావనను తగ్గించుకొంటూ ఆత్మభావనను పెంచుకొంటూ వెళ్ళటమే సాధన యొక్క ప్రయోజనం, మనం సాధన చేసేటప్పడు అది జరుగుతోందా, లేదా అని చూసుకోవాలి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 08-01-04 | గురు | జిన్నూరు శ్రీ రమణక్షేత్రం - భగవాన్ జయంతి |
| 13-01-04 | మంగ | కాపవరం గీతామందిరం |
| 17-01-04 | శని | మహదేవపట్నం శివాలయంలో |
| 18-01-04 | ఆది | తాడినాడ, కృష్ణా జిల్లా |
| 21-01-04 | బుధ | మల్కిపురం, సాయిబాబా మందిరం |
| 26-01-04 | సోమ | పిట్లవానిపాలెం, నంబూరు మీదగా NH.5లో పొన్నూరురోడ్‌లో సందోలు వంతెన ప్రక్కనుండి పిట్లవానిపాలెం, గుంటూరు జిల్లా |
| 27-01-04 | మంగ | కర్లపాలెం, గుంటూరు జిల్లా - డూ - |



## జిన్నూరు శ్రీరమణక్షేత్రంలో
## భగవాన్ శ్రీరమణమహర్షి 124వ
## జయంతి మహోత్సవము

*ది. 08-01-2004 గురువారం ఉదయం గం॥6-00ల నుండి*

**"సద్గురు దర్శనం"**

*ఉదయం గం॥8-00ల నుండి*

**"భగవాన్ పూజ శ్రీ రమణక్షేత్రములో"**

*ఉదయం గం॥ 10-00ల నుండి 12ల వరకు*

**"దూరప్రాంత భక్తులకు భోజనాలు"**

*మధ్యాహ్నం గం॥ 12-00 లకు*

**"శ్రీ నాన్నగారు ఆశ్రమంనకు రాక"**

*మధ్యాహ్నం గం॥ 12-30 ని॥లకు*

**"శ్రీ భగవాన్ చరిత్ర తెలుగులో వీడియో ప్రదర్శన"**

*మధ్యాహ్నం గం॥ 2-00లకు*

**"సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు"**



ది. 20-12-03న భీమవరం శ్రీ తాడిమళ్ల వారి కేంద్రంలో జరిగిన ఆధ్యాత్మిక సభలో **సద్గురు శ్రీనాన్నగారు, జస్టిస్ శ్రీ బి. ప్రకాష్‌రావుగారు, జస్టిస్ శ్రీ పి. రామకృష్ణంరాజుగారు మరియు జస్టిస్ కె. సంజీవరావు నాయుడుగారు**



**సత్యం హోమియో హస్పటల్‌ను ప్రారంభిస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు**

ది. 19-12-03న భీమవరం, జువ్వలపాలెంరోడ్‌లో సత్యం హోమియో హస్పటల్‌ను సద్గురు శ్రీ నాన్నగారు ప్రారంభించినారు.